క్లుప్తంగా

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

పాన్‌గల్: పోలీసు ఉద్యోగంలో భాగంగా కొంత సమయం ఆరోగ్యం కాపాడుకోవడంపై దృష్టి సారించాలని ఎస్‌ఐ నాగన్న సిబ్బందికి సూచించారు. శనివారం స్టేషన్ ఆవరణలో సిబ్బందికి పరేడ్ చేయించారు. రోజు వ్యాయామం చేయాలని, శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ రాంచందర్, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత భవన మరమ్మతులకు శ్రీకారం



మదనాపురం: మండలంలోని మార్కెట్ యార్డులో రైతు విశ్రాంత భవనం మరమ్మతు పనులకు శనివారం చైర్మన్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మార్కెట్ నిధుల నుంచి రూ.4లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్, సర్పంచ్ రామనారాయణ, నాగన్న యాదవ్, చాంద్ పాషా, బాలు, సత్యంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దాతలకు సన్మానం

పాన్‌గల్: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న బాలరాజు ఇంటి నిర్మాణంలో ఆర్థిక తోడ్పాటునందించిన దాతలు తిరుపతయ్యసాగర్, జ్యోతినందన్ రెడ్డిని ఎస్‌ఐ నాగన్న శనివారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాముయాదవ్, సాయికుమార్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సురేష్‌శెట్టి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భర్తపై వేధింపుల కేసు నమోదు

గోపాల్‌పేట: రేవల్లి మండలంలో శనివారం వరకట్న వేధింపుల కేసు నమోదైనట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. రేవల్లికి చెందిన కృష్ణవేణిని నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జెటప్రోల్ చెందిన మునగాల గోవిందుకు 2017లో వివాహం జరిపించారు. అప్పటి నుంచి అదనపు కట్నం కోసం వేధిస్తు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలిపారు. 2020లో ఆమె రేవల్లికి తిరిగి వచ్చింది. శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఖత్నా క్యాంపు

కొత్తకోట: అమినుల్ మిస్కిన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని క్యూఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉచిత మహా ఖత్నా క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో 20 మందికి చికిత్స చేయించుకున్నట్లు నిర్వాహకుడు అబ్దుల్ లతీఫ్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సుల్తాన్, తయ్యబ్, మతీన్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

కూలిన మట్టిమిద్దెల పరిశీలన



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లిలో అకాల వర్షాలకు రెండు మట్టిమిద్దెలు కూలిపోయాయి. వాటిని శనివారం డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విపత్తు నిర్వహణ కింద ఇచ్చే ఆర్థిక సాయం చేయాలని కోరారు. వారి వెంట ఈశ్వరయ్య, వెంకటయ్యనాయుడు, శ్రీనివాస్‌గౌడ్, రఘు గ్రామస్తులు ఉన్నారు.

విధుల్లోకి 16 మంది జేపీఎస్‌లు



వనపర్తి: ఉద్యోగ క్రమబద్ధీకరణ కోసం 16 రోజులుగా సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరాలని.. లేదంటే తొలగిస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించడంతో శనివారం 16 మంది జేపీఎస్‌లు విధుల్లో చేరుతున్నట్లు రాతపూర్వకంగా ఇచ్చారని డీపీఓ సురేష్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం వరంగల్ జిల్లాలో మృతిచెందిన సోనికి సంతాపం తెలియజేస్తూ జూనియర్, ఔట్‌సోరింగ్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి రాజీవ్‌చౌక్‌లో మానవహారం ఏర్పాటు చేశారు.

లక్ష్యానికి చేరువలో 'కంటి వెలుగు'

- జిల్లాలో 3.26 లక్షల మందికి కంటి పరీక్షలు
- ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్యాంపుల నిర్వహణ



శంకరమ్మపేటలో కంటి వెలుగు శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా అధికారులు (ఫైల్)

మదనాపురం: ప్రభుత్వం అంధత్వ నివారణే లక్ష్యంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. జిల్లాలో 65 శిబిరాలు లక్ష్యంగా పెట్టుకొని 37 ఇప్పటికే పూర్తి చేశారు. జనవరి 19న ప్రారంభమైన ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుంది. ఇప్పటి వరకు 3,26,102 మందికి కంటి పరీక్షలు చేశారు.

పేదలకు దోహదపడుతున్న పథకం..

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు చూపు మందగిస్తే నిర్లక్ష్యంగా ఉంటారు. వయసు పైబడుతుంటే కంటి సమస్యలే వస్తాయని పట్టించుకోరు. ఇందులో పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువ. ఇలాంటి వారి కోసమే ప్రభుత్వం ఈ పథకాన్ని ఏర్పాటు చేసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం అధికారులు 28 టీంలు, 2 బఫర్ టీంలు పని చేస్తున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలకు కంటి పరీక్షలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 31,362 మందికి కంటి అద్దాలను ఇచ్చారు. 36,559 మందికి ఇవ్వనున్నారు. 16,656 మందిని కంటి ఆపరేషన్ కోసం సిఫారసు చేశారు. 14 మండలాల్లో కంటివెలుగు కొనసాగుతుంది. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు.

అవసరమైన వారికి ప్రత్యేకంగా..

ఉద్యోగులు, జర్నలిస్టులు, పోలీసు, న్యాయశాఖ ఉద్యోగులకు ప్రత్యేకంగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. తమ కళ్లను చూయించుకునేందుకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన కూలీలు సైతం శిబిరానికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని అధికారులు చెబుతున్నారు.

పేదోళ్లకు మేలు..



ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటివెలుగు కార్యక్రమంతో పేదలకు మేలు కలుగుతుంది. చాలా మందికి కంటి సమస్యలు ఉన్నాయి. ప్రజల ఇబ్బందుల గుర్తించి ప్రభుత్వం కంటి పరీక్షలు చేయించడం సంతోషం. మా గ్రామంలో అందరూ కంటి పరీక్షలు చేయించుకున్నారు.

– రమేష్‌యాదవ్, తిర్మాలయపల్లి

స్పందన బాగుంది..



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమానికి గ్రామీణ ప్రజలు వినియోగించుకుంటున్నారు. ఒకప్పుడు కంటి సమస్యలు తలెత్తితే డాక్టర్లు దొరికేవారు లేరు. ప్రస్తుతం ఎంతో మంది కంటి సమస్యతో బాధపడుతున్నారు. దీని కారణంగానే ప్రజలు శిబిరాల వద్దకు వస్తున్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రవిశంకర్, జిల్లా వైద్యాధికారి, వనపర్తి

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం



పీఏసీఎస్ సీఈఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్

అమరచింత: వరి ధాన్యం పూర్తిస్థాయిలో ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామని సీఎం కేసీఆర్ చేసిన ప్రకటనకు.. అధికారులు ఆచరిస్తున్న తీరుకు పొంతన లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ ఆరోపించారు. శనివారం మండలంలోని మస్తీపురం క్రాస్‌రోడ్‌లో ధాన్యం ఆరబెట్టుకున్న రైతులను కలిసి మాట్లాడారు. కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం తరలింపునకు సరైన రవాణా వ్యవస్థ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించడంతో పాటు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారన్నారు. ఆత్మకూర్, అమరచింత మండలాల్లో కోతలు ప్రారంభం కాకముందే కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయని కారణంగా రైతులు తాము పండించిన ధాన్యాన్ని పక్క రాష్ట్రాలకు తరలించి దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు అమ్ముకున్న పరిస్థితులు దాపురించాయన్నారు. రైతులు పండించి వరిని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకుంటే కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం పీఏసీఎస్ సీఈవోకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధానకార్యదర్శి అయూబ్‌ఖాన్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, హన్మంతునాయక్, తౌఫిక్, శ్యాం, పోసిరిగారి విష్ణు, రహ్మతుల్లా, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని కర్నూల్ జాతీయ రహదారిపై మోటర్ సైకిల్, కంటైనర్ లారీ ఢీ కొట్టుకోవడంతో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల జిల్లా పూడూరు చెందిన రవి బైకుపై మిర్చి సంచి తీసుకుని పెబ్బేరు సంతలో అమ్మకానికి బయలుదేరాడు. బైపాస్ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆయనను ఆస్పత్రికి తరలించారు.

రహెమానియ మసీద్ కమిటీ రద్దు

అమరచింత: పట్టణంలోని రహెమానియ మసీద్ కమిటీ రద్దు చేసినట్లు కమిటీ అడ్వయిజర్ షంషీర్, గౌస్ తెలిపారు. అధ్యక్షుడిగా ఉన్న నిసార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడంతో మసీద్ నిర్వహణలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. మసీద్ నిర్మాణానికి కొత్తగా వసూలు చేసిన డబ్బులు, వాటి ఖర్చు వివరాలను సైతం సభ్యులకు తెలపడం లేదన్నారు. రంజాన్ మాసంలో మసీద్ నిర్వహణ భారంగా మారిందన్నారు. కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు అధ్యక్షుడిని తొలగించినట్లు ప్రకటించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన భాస్కర్ ఏప్రిల్ 18న తన మొబైల్ ఫోన్ పోగొట్టుకోగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు లొకేషన్ గుర్తించి శనివారం తిరిగి అప్పగించినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ పరీక్షల నిర్వహణ అధికారిగా జగదీశ్వర్‌రెడ్డి



ఆత్మకూర్: టీఎస్‌పీఎస్సీ పరీక్షల నిర్వహణ అధికారిగా మండలంలోని తిప్పడంపల్లికి చెందిన జగదీశ్వర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. గ్రామానికి చెందిన దివంగత వెంకట్‌రెడ్డి, సరోజనమ్మ దంపతులకు 4వ కుమారుడైన ఈయన గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు అభ్యసించారు. ఇంటర్ ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, డిగ్రీ నారాయణపేటలో, ఎంసీజే హైదరాబాద్‌లో చేశారు. అనంతరం గ్రూప్స్ ద్వారా డీటీ, తహసీల్దార్ పలు ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. డీఆర్‌డీఓ, నల్లగొండ ఆర్డీఓగా, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల ఓఎస్‌డీగా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈయనను టీఎస్‌పీఎస్సీ పరీక్షల నిర్వహణ అధికారిగా నియమించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి

అడ్డాకుల: సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమైందని, పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం వివిధ గ్రామాలకు మంజూరైన రూ.2కోట్ల అభివృద్ధి నిధుల ప్రొసిడింగ్ పత్రాలను ఎమ్మెల్యే ఆల ఆయా గ్రామాల నాయకులకు అందజేశారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. తెలంగాణ ఏర్పడక ముందు ఎడారిగా ఉన్న ఈ ప్రాంతంలో 21 చెక్‌డ్యాంలను నిర్మించుకున్నామని చెప్పారు. కొత్తగా మరో 9 చెక్‌డ్యాంలు మంజూరైనట్లు తెలిపారు. గణపురం బ్రాంచ్ కెనాల్ ద్వారా పెద్దవాగులో కృష్ణా జలాలు పారుతున్నాయని, పెరిగిన భూగర్భ జలాలతో సాగు పెరిగి ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారిందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్, ఎంపీపీ కళావతి, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఒండ్రుమట్టి తరలింపుపై వాగ్వాదం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఒండ్రు మట్టి టిప్పర్లను కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్న ఘటనలో వాగ్వాదం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజాలాపూర్ సమీపంలోని ఓ చెరువు నుంచి టిప్పర్ల ద్వారా మూసాపేట మీదుగా కర్వెనకు ఒండ్రు మట్టిని నిత్యం తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో మూసాపేటలో సీసీరోడ్లు పాడవడంతో పాటు తాగునీటి పైప్‌లైన్‌లు పగిలి పోతున్నాయంటూ సర్పంచ్ కుమారుడు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శెట్టి శేఖర్ మరి కొందరు కలిసి రాత్రి టిప్పర్లను అడ్డుకున్నారు. వాటిని బస్టాండ్‌లో నిలిపి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. కర్వెన కోసం మట్టిని తరలిస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని బీఆర్‌ఎస్ నాయకులు, భారీ వాహనాలతో రోడ్లు, పైప్‌లైన్లు దెబ్బతింటున్నాయని కాంగ్రెస్ నాయకులు వాగ్వివాదానికి దిగారు. దీంతో సమాచారం అందుకున్న ఎస్‌ఐ విజయ భాస్కర్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువర్గాలను నచ్చజెప్పి టిప్పర్లను అక్కడి నుంచి పంపించారు.

దాహం తీరుస్తున్న చలివేంద్రాలు



చలివేంద్రంలో మజ్జిగ అందిస్తున్న నిర్వాహకులు

అమరచింత: మండు వేసవిలో దాహంతో అలమటిస్తున్న బాటసారులతో పాటు ప్రయాణికులకు, ప్రజలకు దాహాన్ని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు, అంబలి కేంద్రాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. పట్టణంలో శబరీనాథ్‌గౌడ్, అక్షయ జ్ఞాపకార్థం చలివేంద్రంతో పాటు అంబలి, మజ్జిగలను బాటసారులకు అందిస్తున్నారు. దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రంతో పాటు అంబలి కేంద్రం నిర్వహిస్తున్నారు. నాస్తిక సమాజం ఆధ్వర్యంలో అంబలికేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాలను 10ఏళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం తాగు నీటితో పాటు మధ్యాహ్నం సమయంలో రాగి అంబలిని వితరణ చేస్తుండటంతో కార్మికులు, ఉపాధి కూలీలు, ప్రయాణికులు ఉపశమనం పొందుతున్నారు. చలివేంద్రాల నిర్వహకులు వారంలో మంగళ, గురు, ఆదివారాల్లో అంబలి అందిస్తున్నారు. వీరి సేవలను అభినందిస్తున్నారు.



అమరచింతలో అంబలి వితరణ చేస్తున్న నిర్వాహకులు



చలివేంద్రం వద్ద అంబలి తాగుతున్న ప్రయాణికులు

పట్టా భూమిలో రోడ్డు వేయడం సరికాదు



రైతులతో కలిసి మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

వనపర్తి: రాజకీయపంతం కోసం రైతుల సొంత భూమిలో కొందరు నాయకులు రోడ్డు వేయడం సరికాదని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని నాచహళ్లి శివారులో నుంచి సవాయిగూడెం జమ్ములతండాకు రైతుల భూమిలో నుంచి రోడ్డు వేసేందుకు ప్రయత్నం చేస్తున్న ప్రదేశానికి వెళ్లిన ఆయన రైతులతో కలిసి మాట్లాడారు. నాచహళ్లికి చెందిన పెద్ద కుర్మన్న, చిన్న కుర్మన్న, సాయులు, వెంకటస్వామి వారి కుటుంబ సభ్యుల పట్టాభూమిలో అనుమతి లేకుండా, కోర్టు నుంచి స్టే తీసుకువచ్చినా పట్టించుకోకుండా రోడ్డు వేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. అమాయక గిరిజనులను రెచ్చగొట్టి బీసీలపైన దాడులు చేయించేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంజన్న యాదవ్, ఉప సర్పంచ్ అబ్దుల్లా, రాజు, చంద్రమౌళి, అంజి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరంజన్‌రెడ్డిని ఓడించి తీరుతాం

- కాంగ్రెస్‌కు 52 సీట్లు వస్తాయి..
- కర్ణాటకలో గెలిస్తే దేశంలో అధికారం పక్కా..
- కాంగ్రెస్ నేత చిన్నారెడ్డి



ర్యాలీలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: జిల్లాలో ఎన్నడూ లేని అవినీతికి పాల్పడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓడించి తీరుతామని పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపును పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. నిరంజన్‌రెడ్డి నది పారే భూమి ఆక్రమించుకున్నాడని, కొన్నది 80 ఎకరాలైతే కాంపౌండ్‌వాల్ నిర్మించింది మాత్రం మొత్తం 160 ఎకరాల్లో అని ఆరోపించారు. అధికార పార్టీ దోపిడీ కారణంగా వాగులో ఇసుక, గుట్టలో ఎర్రమట్టి, చెరువులో నల్లమట్టి లేదన్నారు. ఇనాం, ప్రభుత్వ భూమిని అధికార పార్టీ నేతలు కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. ఏ రిజర్వాయర్ నిర్మించిన కింద, పైన, పక్కన భూములు కొనుగోలు చేసే ఆనవాయితీకి తెరలేపారని నిప్పులు చెరిగారు. వనపర్తి, పెబ్బేర్‌లో దేవుడి భూమిని ఆక్రమించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కర్ణాటకలో గెలిస్తే దేశంలో పక్కా..

కర్ణాటకలో గెలిస్తే దేశంలో, తెలుగు రాష్ట్రాల్లో పార్టీ అధికారం పక్కా చేజిక్కించుకుంటుందన్నారు. 1970 దశకంలో కర్ణాటకలో గెలవడంతో తెలుగు రాష్ట్రాలతో పాటుగా దేశంలోనూ విజయకేతం ఎగురవేసిందన్నారు. ఇప్పటికిప్పుడు రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహిస్తే పార్టీ 52 సీట్లు వస్తాయని సర్వేలో తేలిందన్నారు. ఈ సీట్లను 60కి పెంచేందుకు కార్యకర్తలు ప్రయత్నించాలని కోరారు. ప్రధాని మోడీ స్థాయిని మరిచి గల్లీ లీడర్‌లా కర్ణాటకలో ప్రచారం చేశారని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో అవినీతి పెరిగిపోవడం, ప్రతి పనికి 40శాతం కమీషన్ వల్లే బీజేపీ ఓడిందన్నారు. ఎగిరెగిరిపడుతున్న బీజేపీకి తెలంగాణలో కాంగ్రెస్ సర్వే ప్రకారం 18 సీట్లు, బీఆర్‌ఎస్‌కు 42 సీట్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో శంకర్‌రావు, చీర్ల విజయ్‌చందర్, కిరణ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, కోట్ల రవి, సమద్, యాదయ్య, మన్యం, యాదగిరి, ఖమర్‌మియ్యా, రాములు, ధర్మారెడ్డి, విజయ్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపు సంబరాలు



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న నాయకులు

ఆత్మకూర్: బీజేపీ మత రాజకీయాలకు కాలం చెల్లిందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్ అన్నారు. శనివారం గాంధీచౌక్‌లో పటాసులు కాల్చి, మిఠాయిలను పంపిణీ చేశారు. దేశవ్యాప్తంగా ప్రజల్లో మార్పు వస్తుందని బీజేపీ ప్రభుత్వ ఆస్తులను అమ్మడమే తప్పా, అభివృద్ధి లేదనే విషయం ప్రజలకు అర్థమైందన్నారు.

పాన్‌గల్: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంపై యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో పటాసులు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వహీద్, రమేష్, లాలయ్యనాయుడు, రంజిత్, మోహన్‌గౌడ్ పాల్గొన్నారు. రాహుల్ గాంధీ జోడో యాత్రతోనే కర్ణాటకలో పార్టీ విజయం సాధించిందని పార్టీ జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్ కేతూరి వెంకటేష్ అన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పటాసులు కాల్చి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో విజయవర్ధన్‌రెడ్డి, అక్కి శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, వెంకట్రాములు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జగదీశ్, కృష్ణ,అంజాద్ అలీ, వేమన్న పాల్గొన్నారు.

కొత్తకోట: కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పట్టణంలో పటాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. బీజేపీ ప్రభుత్వానికి కర్ణాటక ప్రజలు వ్యతిరేక తీర్పు ఇవ్వడంతో పాటు కాంగ్రెస్ పార్టీకి మంచి మెజార్టీ ఇచ్చారని మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు మధుసుధన్‌రెడ్డి అన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని గాంధీచౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కాంగ్రెస్ నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రాజేంద్ర ప్రసాద్‌యాదవ్, విష్ణు, ఆశన్న, సూక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి: మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. మండల చౌరస్తాలో పటాసులు కాలుస్తూ, మిఠాయిలు పంచిపెట్టారు. పరమేష్, శ్రీలతరెడ్డి, షాహెదా బేగం, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు పటాసులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

వనపర్తి: మండలంలోని కిష్టగిరి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం సాయంత్రం మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి తన క్యాంపు కార్యాలయంలో కండువాలను కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో ఆంజనేయులు, శేఖర్, కురుమూర్తిలతో పాటు మరికొందరు ఉన్నారు. మండలంలోని సవాయిగూడెం చెందిన వెంకటస్వామి అనారోగ్యంతో బాధపడుతుండగా సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును మంత్రి శనివారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.



కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు



నందిన్నె మన గ్రోమోర్ సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

కేటీదొడ్డి: నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకటేష్ హెచ్చరించారు. శనివారం మండలంలోని నందిన్నెలోని గ్రోమోర్ కేంద్రంతో పాటు ప్రైవేట్ ఎరువుల దుకాణంలో రిజిస్టర్లను ఆయన తనిఖీ చేశారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని యజమానులకు సూచించారు. ఆయన వెంట కానిస్టేబుల్ జ్యోతికాంత్, రజిని తదితరులు ఉన్నారు.

మల్దకల్: ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్, ఎస్‌ఐ శేఖర్‌లు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా రశీదులు పొందాలన్నారు. అంతకు ముందు ఆయన మల్దకల్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ ఖజాపాషా తదితరులు పాల్గొన్నారు.

గట్టు: ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాల విక్రయించాలని వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి, ఎస్‌ఐ పవన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలలో రిజిస్టర్లను తనిఖీ చేశారు. చేశారు. దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువులు, క్రిమి సంహారక మందులు, విత్తనాల నిల్వ గురించి అధికారులు దుకాణ యజమానులను అడిగి తెలుసుకున్నారు.